క్లుప్తంగా

ప్రొటోకాల్ ఉల్లంఘనపై జేసీకి సర్పంచ్ ఫిర్యాదు



కలెక్టరేట్‌లో జేసీ నిషాంతికి ఫిర్యాదు అందజేస్తున్న సర్పంచ్ అరుణదేవిడ్

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ప్రొటోకాల్ పాటించకుండా తనను అవమానిస్తున్నారని పేరూరు సర్పంచ్ దాసరి అరుణ డేవిడ్ ఆవేదన వ్యక్తం చేశారు. దళిత మహిళను కావడంతో గ్రామంలో కొందరు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె అన్నారు. గ్రామంలోని టీడీపీ నాయకుడి ఇంటి వద్ద ఈ నెల 1న ఏర్పాటు చేసిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి పిలవలేదని సర్పంచ్ ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సచివాలయాల వద్ద నిర్వహిస్తే పేరూరులో టీడీపీ నాయకుడి ఇంటి వద్ద నిర్వహించడాన్ని ఆమె ప్రశ్నించారు. తనకి పదవీకాలం ఇంకా ఉందని అయినప్పటికీ మండల, పంచాయతీ అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఆమె తెలిపారు. ప్రొటోకాల్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని జేసీ టి.నిషాంతికి ఆమె ఫిర్యాదు అందజేశారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బిరామ్, వాసంశెట్టి శ్రీనివాసరావు, దొంగ ఆంజనేయులు, ఉప సర్పంచ్ కుడుపూడి సత్యానారాయణ, వార్డు మెంబర్లు ఉన్నారు.

శామ్యూల్‌సాగర్‌కు సత్కారం

యానాం: ఆల్ ఇండియా బిషప్స్ అండ్ పాస్టర్ ఫెలోషిప్ (ఏఐబీపీఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎంపికైన జెడ్పీటీసీ, రెవరెండ్ దొమ్మేటి శామ్యూల్‌సాగర్‌ను సోమవారం యానాం మెట్టకూరు మదర్‌సుశీల మెమోరియల్ బాప్టిస్టు చర్చి సంఘస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా, పాస్టర్‌గా శామ్యూల్‌సాగర్ సేవలందిస్తూ, అనాథ పిల్లలకు ఉచితంగా విద్యతోపాటు ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శామ్యూల్ సాగర్ జాతీయస్థాయిలో పదవి పొందడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాన్, భైరవ మూర్తి, చిరంజీవి, గోపాలకృష్ణ, దడాల ఆనంద్, మార్క్, సుధీర్ పాల్గొన్నారు.

ఎంఈవోగా శంకర్రావు

ఉప్పలగుప్తం: మండల ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా నూకల వీర శంకర్రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకూ అనాతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంటుగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న కిరణబాబు స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్ఈవో-2 సత్తి సత్యకృష్ణ, కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు ఆయనను మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు.

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు ఒక భక్తురాలు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన రూప మాధురి సోమవారం స్వామివారిని దర్శించుకుని అన్నదానానికి విరాళం అందజేశారు. ఆలయ పురోహితులు, దేవస్థానం అధికారులు ఆమెకు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ సహాయ కమిషనర్, ఈవో వి.సత్యానారాయణ దాతను అభినందించారు.

పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సత్కారం

అమలాపురం టౌన్: స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల్లో ఆకుమర్తి మధుబాబు, పెన్నాడ ప్రవీణ్ పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై విజేతలయ్యారు. గ్రంథాలయ పాఠకులైన యువకులు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికకావడం అభినందనీయమని గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ అన్నారు. ఆ ఇద్దరు ఉద్యోగార్థులను గ్రంథాలయాధికారి, పాఠకులు సోమవారం సత్కరించి అభినందించారు. గ్రంథాలయంలోని పోటీ పరీక్షల పుస్తకాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుంటున్నారని గ్రంథాలయాధికారి తెలిపారు.

ప్రైవేట్ బ్యాంకర్ల వేధింపులను అరికట్టాలి

సాక్షి, అమలాపురం: అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి దళిత బలహీన వర్గాల మహిళలను వేధింపులకు గురిచేయడంతోపాటు భౌతిక దాడులు చేస్తూ భయాందోళన సృష్టిస్తున్న ప్రైవేటు బ్యాంకుల ఆగడాలను అరికట్టాలని కేవీపీఎస్ సీపీఎం సీఐటీయూ, దళితసేన సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.దుర్గాప్రసాద్, ఎన్ బలరాం మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో వివిధ ప్రైవేట్ బ్యాంకులు అమాయకులకు అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ బలవంతపు వసూలుకు పాల్పడుతూ పీడిస్తున్నారని ఆరోపించారు. అధిక వడ్డీలు చెల్లించలేక పేద కుటుంబాలు ఇబ్బందులకు పడుతున్నాయని వాపోయారు. ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల అగడాలను అడ్డుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బాధితులు గెద్దం ఏసురాజు, విపర్తి మోహనరావు, దళిత సేన జిల్లా అధ్యక్షుడు డేవిడ్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

దక్కని గౌరవం.. అందని వేతనం

- ఎంపీటీసీ సభ్యులకు కానరాని గుర్తింపు
- 16 నెలలుగా గౌరవ వేతనం బకాయిలు
- నిధులు విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ సభ్యులపై అధికారుల చిన్నచూపు
- గ్రామాల్లో కూటమి నేతలకే పెత్తనం



గౌరవ వేతనం చెల్లించాలని ఇటీవల అల్లవరం మండల పరిషత్ సమావేశంలో నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు

అమలాపురం రూరల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలిన కూటమి ప్రభుత్వం పాలన వ్యవహారాల్లోనూ ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యకమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను పక్కన పెట్టి కూటమి నేతలకు పెత్తనం అప్పగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో 90 శాతం స్థానిక సంస్థలు వైఎస్సార్ సీపీ ఖాతాలోనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలపై, ప్రజాప్రతినిధులపై చిన్నచూపు చూస్తోందనే ఆరోపణలున్నాయి. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజాప్రతినిధులు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయకుండా రాజ్యాంగ విరుద్ధంగా అధికార పార్టీ కూటమి నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారని పలువురు వాపోతున్నారు. కూటమి పాలన విధానంపై పలువురు తీవ్ర అభ్యతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియకుండా విస్మరించి కూటమి నేతల చేతుల మీదుగా నిర్వహిస్తున్నారని పలువురు మండల సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నా అధికారుల తీరు మారడం లేదు. ప్రోట్‌కాల్ పాటించాల్సిన అధికారులు కూటమి నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

అందని గౌరవ వేతనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు ఎంపీటీసీ సభ్యులకు ఇచ్చే గౌరవ వేతనం విడుదల చేయలేదు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని 7 మండలాల్లో 110 ఎంపీటీసీ సభ్యులున్నారు. వారికి ప్రతినెలా రూ.3 వేల గౌరవ వేతనం ఇవ్వాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2023 డిసెంబర్ వరకూ రెండు విడతలుగా గౌరవ వేతనాన్ని చెల్లించారు. 2024లో బిల్లు పెట్టి మూడో విడత చెల్లించేందుకు చర్యలు తీసుకునే సమయంలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఎంపీటీసీ సభ్యులకు వేతనం చెల్లింపు ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. జూన్ 12 కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. గౌరవ వేతన బకాయిలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. 2021 సెప్టెంబర్ చివరి వారంలో ఎంపీటీసీలు ప్రమాణ స్వీకారం చేయగా 2023 డిసెంబర్ వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లించింది. అనంతరం 2024 జూలై నుంచి అక్టోబర్ వరకు కేవలం నాలుగు నెలలు మాత్రమే కూటమి ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లించింది. తర్వాత ఇప్పటి వరకూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఖాతాల్లో గౌరవ వేతనం జమ కాలేదు. ఎంపీటీసీ సభ్యులకు గౌరవం, గౌరవ వేతనం అందని ద్రాక్షలా మారింది.

నియోజకవర్గాల్లో ఎంపీటీసీ సభ్యుల సంఖ్య

అమలాపురం	25
అల్లవరం	19
ఉప్పలగుప్తం	17
ముమ్మిడివరం	12
ఐ. పోలవరం	16
కాట్రేనికోన	21
మొత్తం	110

ప్రస్తుతం గుర్తింపు లేదు



ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎంపీటీసీ సభ్యులకు గుర్తింపు గౌరవ లేదు. కనీసం గౌరవ వేతనాలు విడుదల చేయడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులకు గౌరవం ఉవ్వడం లేదు. ఎంపీటీసీ పదవి మూడు నెలలుగా ఒకసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు మాత్రమే పరిమితం అన్నట్టుగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎంపీటీసీ సభ్యులకు నిధులు లేవు.. విధులూ లేవు. కనీసం గౌరవ వేతనాలైనా వెంటనే విడుదల చేయాలి

– చొల్లంగి సుబ్బిరామ్, ఎంపీటీసీ సభ్యుడు, పేరూరు

గౌరవ వేతనం మంజూరు చేయాలి



కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలైనా మాకు ఇప్పటికీ గౌరవ వేతనాలు ఇవ్వలేదు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సమావేశానికి వెళ్లడం తప్ప అంతకు మించి గౌరవం కనిపించడం లేదు. కనీసం గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలపై ఎంపీటీసీ పేర్లు కూడా వేయడం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గౌరవ వేతనం నిధులు విడుదల చేయాలి.

– అడపా సత్తిబాబు, ఎంపీటీసీ సభ్యుడు, ఈదరపల్లి

చంద్రబాబు పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ ఇక్కట్లే

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి విశ్వరూప్
- అమలాపురంలో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమం



అమలాపురంలో క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రదర్శిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్, పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్



కొమరగిరిపట్నంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంలో క్యూఆర్ కోడ్ ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం టౌన్: చంద్రబాబు నయవంచక పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం 9వ వార్డులో సోమవారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్వరూప్ ఇంటింటా ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళ తమకు ప్రతి నెలా ఇస్తామన్న రూ.1,500 కోసం ఏడాదికి పైగా ఎదురు చూసి మోసపోయారని విశ్వరూప్ అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ భృతి హామీని విస్మరించడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని విమర్శించారు. బాబు పాలనలో అన్ని వర్గాల ప్రజలూ నిలువునా మోసపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ కూటమి నేతలు సాధ్యం కాని హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా తాత్సారం చేస్తూ కాలం వెళ్లదీస్తూ ప్రజలు మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 9వ వార్డులోని కమ్యూనిటీ హాలులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి విశ్వరూప్, డాక్టర్ శ్రీకాంత్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే హాలులో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలతో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన నిర్వహించిన సభలో విశ్వరూప్ మాట్లాడారు. అనంతరం వార్డులో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాల చిట్టాతో ఉన్న క్యూఆర్ కోడ్ పత్రాలను పంచారు. మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు క్యూఆర్ కోడ్ పత్రాలు ప్రదర్శించి బాబు మోసాలపై నిరసన తెలిపారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పేరి శ్రీనివాసరావు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, నాగారపు వెంకటేశ్వరరావు, చిత్రపు రామకృష్ణ, కట్టోజు సన్యాయ్యదాసు, పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, పార్టీ నాయకులు కుడుపూడి భరత్ భూషణ్, ఈతకోట శ్రావణ్‌కుమార్, గున్నేపల్లి భీమశంకరం పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

అల్లవరం: సూపర్ సిక్స్ పథకాలను ఎలాంటి షరతులు లేకుండా అర్హులందరికీ అందిస్తామని ఎన్నికల వేళ వరాలు కురిపించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పథకానికీ నియమ నిబంధనలు పెట్టి ప్రజలకు మొండి చేయి చూపాడని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ విమర్శించారు. బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలో మూడు సచివాలయాల్లో సోమవారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ హాజరై ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ ఫోన్లో క్యూఆర్ కోడ్ ద్వారా కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల హామీలే కాకుండా ప్రకటించని ఎన్నో పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. సంక్షేమం అంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేంతగా పాలన అందించారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ రాపాక విజయలక్ష్మీ, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లూరి సురేష్‌రాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు తిక్కా ప్రసాదు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కడలి లక్ష్మణరావు, కార్యదర్శి కొనుకు బాబురావు, పార్టీ నాయకులు కొనుకు మహేష్, కుడుపూడి శ్రీనివాసరావు, నిమ్మకాయల శేఖర్, గెద్దాడ జాన్‌తాతారావు, మోసుగంటి సింహాద్రి, ఉల్లింగి సంధ్యాకుమారి, వాసర్ల రాధ, యల్లమిల్లి బాబీ, కడలి ప్రసాదు, ఉండ్రాజవరపు నాగేంద్ర, గుర్రం నాగరాజు, బొంతు సురేష్, ఉందుర్తి ప్రసాదు, యనమదల దుర్గాప్రసాదు పాల్గొన్నారు.

పేదలను దగా చేసిన కూటమి ప్రభుత్వం



సన్నవిల్లిలో మహిళకు బ్రోచర్‌ను అందజేస్తున్న పార్టీ నాయకులు

ఉప్పలగుప్తం: ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపుతోందని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని సన్నవిల్లి, నంగవరం, విలసవిల్లి గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీల అధ్యక్షులు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులంతా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన తీరును ప్రజలకు వివరించారు. క్యూఆర్ కోడ్‌తో ఉన్న బ్రోచర్‌లను అందించి వాటిని పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు జిన్నూరి వెంకటేశ్వరరావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరాజాకుమారి, సర్పంచ్‌లు సలాది ఊర్మిళాదేవి, జొన్నాడ శ్రీదుర్గ, పెయ్యల రాజ్‌కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు పెట్టా అప్పారావు, కొంకి ఏడుకొండలు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు యనమదల పల్లంరాజు, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, గ్రామ కమిటీల అధ్యక్షుడు సలాది సతీష్, గుండుమోగుల వెంకటనారాయణ, పార్టీ నాయకులు శీలం సూరిబాబు, కోరుకొండ మంగాయమ్మ, తొత్తరమూడి బాబులు, నక్కా చిన్నా, కోలా ఏసు, బళ్ల నాగసతీష్, పరమట నాగబాబు, శీలం శ్రీనుబాబు, బీర నరసింహమూర్తి, నందుల సత్య, పోతుల సోని, వజ్రపు లారెన్స్, ముషిణి రాంబాబు, అమరగంటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి



వివిధ కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు

అమలాపురం రూరల్: అధికారుల దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలకు వేగంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి అర్జీదారుల నుంచి సుమారుగా 250 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కర వేదికకు వచ్చిన అర్జీలను పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి డీఆర్వో, ఆర్డీవో కె.మాధవి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి, జీఎస్ డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ రాజేశ్వరరావు, జిల్లాస్థాయి అధికారులు, వికాస జిల్లా మేనేజర్ జి రమేష్ పాల్గొన్నారు.

12న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖల నేతృత్వంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈనెల 12న అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాసం స్థల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు చదువుతున్న విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సోమవారం అధికారులను ఆదేశించారు. తెలిపారు.1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర మాట్లాడుతూ నులి పురుగుల నిర్మూలనకు ఏడాదికి రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రసాయిలో వాట్సాప్ గవర్నెన్స్ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మనమిత్ర క్యాంపెయిన్ కార్యక్రమం ప్రతి నెల 5న నిర్వహించాలని గ్రామ వార్డు సచివాలయ అధికారులను ఆదేశించారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

పుట్టిన గంటలోపే శిశువుకు తల్లి పట్టించాలని, తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని కలెక్టర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల ప్రచార పోస్టర్లను ఆయన సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలకు అవగాహన పెంచాలన్నారు. ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు మండల, గ్రామస్థాయిల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించాలన్నారు.

ఫోస్టర్ కేర్ (తాత్కాలిక దత్తత) ఆరేళ్లు పైబడి 18 ఏళ్లలోపు పిల్లలను రెండు సంవత్సరాల పాటు పెంచి తదుపరి శాశ్వతంగా దత్తత పొందే అవకాశం ఫోస్టర్ కేర్ ద్వారా కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఫోస్టర్ కేర్ పోస్టర్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి సీడీపీవోలు సిబ్బంది పాల్గొన్నారు.

'విహారి' పుస్తక సమీక్ష

అమలాపురం టౌన్: జగన్నాథ పండితరాయుల నవలలపై రచయిత జేఎస్ మూర్తి రచించిన 'విహారి' పుస్తకంపై సమీక్షా కార్యక్రమం స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద సోమవారం నిర్వహించారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సాహిత్య సమావేశంలో ఓరుగంటి సీత పుస్తక సమీక్ష చేశారు. జగన్నాథుని రచనలో ప్రేమ, క్షమ, పశ్చాత్తాపం, విముక్తి వంటి విలువలు స్పష్టంగా దర్శనమిస్తాయని సీత అన్నారు. బాల కవి, అవధాని జానదుర్గా మల్లికార్జునరావు మాట్లాడుతూ పుస్తకంలోని సాహితీ విలువలను వివరించారు. వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ సమావేశంలో వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర పుస్తకంపై మాట్లాడారు. సంస్కార భారతి ప్రతినిధి పుత్సా కృష్ణకామేశ్వర్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ సాహితీ సమావేశంలో వాసంశెట్టి బలరామకృష్ణ, పేరి లలిత, గోటేటి గంగాధర్, కుడుపూడి త్రినాథ్, నూకల సత్యనారాయణ మాట్లాడారు. అంతర్జాతీయ వాకర్స్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మను వాకర్స్ ఘనంగా సత్కరించి అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అమలాపురం రూరల్: మోటార్ సైకిల్‌పై వెళ్తున్న యువకుడికి కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లికి చెందిన పెనుమాల దుర్గాప్రసాద్ (21) మోటార్ సైకిల్‌పై ఆదివారం రాత్రి అనాతవరం వెళుతూ భట్నవిల్లి వనువులమ్మ తల్లి ఆలయం వద్ద అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఆ యువకుడు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో అందించాలి



పోలేకుర్రు సామాజిక తనిఖీ గ్రామసభలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

తాళ్లరేవు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసిన కూలీలకు వేతనాలు సకాలంలో అందించాలని పోలేకుర్రు గ్రామ పంచాయతీ సర్పంచ్ వెంటపల్లి నూకరాజు కోరారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన అధ్యక్షతన సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఏపీఎస్ఆర్ఈజీఎస్ ఏపీఓ తేజస్విని పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమ పరిశీలనకు ఏపీఎస్ శుభశ్రీ హాజరై పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులు, కూలీల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంటపల్లి నూకరాజు మాట్లాడుతూ కూలీలకు వేతనాలు సకాలంలో అందించాలని, సౌకర్యాలు కల్పించాలని కోరారు. పోలేకుర్రు పంచాయతీలో 2024-25లో 145 పనులు చేసామని, సుమారు రూ.58 లక్షలు ఖర్చు చేసినట్లు ఎస్ఆర్‌పీ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.విజయలక్ష్మి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, నాయకులు దడాల బుజ్జిబాబు, టేకుమూడి ఈశ్వరరావు, నిమ్మకాయల మూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన



పిల్లంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నేతలు

తాళ్లరేవు: పిల్లంక గ్రామంలో పవిత్ర గౌతమి గోదావరి తీరాన పుష్కర్‌ఘాట్ వద్ద శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సుమారు 130 ఏళ్ల క్రితం ఆలయ దాత, అనువంశిక ధర్మకర్త భూపతిరాజు తిరుపతిరాజు నిర్మించిన ఈ ఆలయం శిథిలస్థితికి చేరడం, భక్తులకు అసౌకర్యంగా ఉండడంతో ఇటీవల జీర్ణోద్ధరణ, కళాపకర్షణ కార్యక్రమాలు నిర్వహించి ఆలయాన్ని తొలగించారు. స్థానిక పురోహితులు వేలూరి వెంకట కామేశ్వరశర్మ (కాశిబాబు) పర్యవేక్షణలో ఆలయ అనువంశిక ధర్మకర్త సాగి భీమేశ్వరరాజు దంపతులతో ఉదయం 8.04 గంటలకు వేద పండితులు మర్ల ఫణిశర్మ, గుత్తైన వీరభద్రశర్మ, మేడవరపు బ్రహ్మన్న, చావలి రవిశర్మ, ఫణి, అక్షయ్ తదితరులు పూజలు నిర్వహించి శంకుస్థాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చింతలపాటి అనూష, శ్రీనివాసరాజు, సాగి బాబ్జీరాజు, సాగి వేణు, తోలేటి శ్రీనివాసు, సాగి శివరామరాజు, కాకర్లపూడి కృష్ణంరాజు, పాకలపాటి కిషోర్, కనుమూరి రాంబాబు, పెట్టా హరికృష్ణ, నాటి సతీష్, అంజూరి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల నిరసన



మొబైల్ ఫోన్లు అప్పగిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అమలాపురం రూరల్: ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల అసోసియేషన్ పిలుపుమేరకు సోమవారం అమలాపురం సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది నిరసన తెలిపారు. అమలాపురం ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సుమారు 20 మంది నిరసన తెలిపి సీడీపీవోకు మెమోరాండం ఇచ్చారు. ఏపీఎఫ్ఆర్ఎస్ రద్దు చేసి పాత పద్ధతిని పునరుద్ధరించాలని, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించేందుకు ఒకే మొబైల్ అప్లికేషన్‌ను ప్రవేశపెట్టాలని, కొత్త ట్యాబ్‌లు అందించి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేసారు. అనంతరం వారి వద్ద ఉన్న ప్రభుత్వ మొబైల్ ఫోన్లను అధికారులకు అప్పగించారు. అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు యాప్‌లకు సపోర్ట్ చేయక ఇబ్బంది పడుతున్నామని విజయలక్ష్మి అన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

అమలాపురం టౌన్: ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించి ఇటీవల తిరుపతి శాంతినికేతన్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న రామచంద్రపురానికి చెందిన దేవు తేజసాయికి అమలాపురం కాంగ్రెస్ నాయకులు రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక వంటెద్దువారి వీధిలో సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నుగ్గుప్రసాద్ రూ.5 వేలు, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాసరావు, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఏలేశ్వరపు రాధాకృష్ణ, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి మొల్లేటి వెంకటేశ్వరావు,పార్టీ నాయకుడు కొర్లపాటి దొరబాబు రూ.10 వేలు కలిపి మొత్తం రూ.15 వేలు విద్యార్థికి అందజేశారు.

దేవస్థానం భూమి ఆక్రమణపై ఫిర్యాదు

యానాం: నియోజకవర్గ పరిధిలో దరియాలతిప్పలో శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన సుమారు ఎకరం భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఇన్‌ఛార్జి ఆర్ఏఓ బుద్ధి అఖిల్‌కు గ్రామస్తులు పలువురు ఫిర్యాదు చేశారు. దేవస్థానం భూమి ఆక్రమణపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేశామని, ఇప్పటి వరకు ఆక్రమణలపై చర్యలు తీసుకోలేదన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలో ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కమిడి బాలయోగి, సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న, మోకా బుజ్జి, కర్రీడి అప్పారావు, వీసీకే పార్టీ మెల్లం చిన్న పాల్గొన్నారు.

దోమలతో ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి

అల్లవరం: దోమ కాటుతో మలేరియా, డెంగీ, ఫైలేరియా తదితర ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సోమవారం బోడసకుర్రులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి మాట్లాడుతూ దోమకారక వ్యాధులను నియంత్రించాలంటే ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటే దోమలను లార్వా దశలో నియంత్రించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దొమ్మేటి శ్రీశాంతిభవాని, ఆరోగ్య సిబ్బంది సాపే సత్యనారాయణ, వనచర్ల సత్యనారాయణ, నల్లి విజయ, రాపాక సౌమ్య, కార్యదర్శి ఆదిశంకరం పాల్గొన్నారు.